క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు నమోదు

కలసపాడు : మండలంలోని మామిళ్లపల్లె గ్రామానికి చెందిన బక్కిరెడ్డి సిరారెడ్డిగారి భాస్కర్‌రెడ్డి, ఆయన తండ్రి వెంకటరెడ్డితోటు మరో ఐదుగురిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కలసపాడు ఎస్‌ఐ తిమోతి అక్రమ కేసు నమోదు చేశారు. మామిళ్లపల్లె గ్రామంలో అంకాలమ్మ, పోలేరమ్మ తిరునాల ఈనెల 21, 22 తేదీలలో నిర్వహించేందుకు గ్రామ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయంపై భాస్కర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గాడిదల వెంటేశ్వర్లును చందాలు ఇచ్చామని, తిరునాల ఆహ్వాన పత్రంలో తమ పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. మీరు మాంసం మనుషులు అని, మీ ఇంటికి కేజీ మాంసం పంపిస్తాను, మమ్మల్ని ప్రశ్నించకూడదని వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి ఒత్తిడి మేరకు భాస్కర్ రెడ్డి ఏమి అనకున్నా వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్రమంగా ఏడు మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసు నమోదు చేశారు. సోమవారం తహసీల్దార్ మధురవాణి ఎదుట పోలీసులు భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డితోపాటు మరో ఐదు మందిని హాజరుపరిచి రూ.4లక్షలు పూచీ కత్తుతో వదిలారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న శివోహం అన్న ప్రసాద సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. శివోహం అన్న ప్రసాద సేవా సంఘం సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది అన్నప్రసాదం స్వీకరించారని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా దాతల సహకారంతో ప్రతి సోమవారం అన్నప్రసాద సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణునారాయణ, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రాయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అందని తల్లికి వందనం



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు

బి.కోడూరు : మండలంలో అర్హులై ఉండి జాయింట్ ఎల్.పి.యం. నెంబరుగా ఉండడంతో భూములు ఎక్కువగా చూపడం వలన అర్హులైన తల్లులు, తల్లికివందనం పథకానికి అనర్హులుగా మిగిలిపోయారు. దీని మూలంగా మండలంలో సుమారు వెయ్యి మందికి పైగా అర్హులైన తల్లులకు తల్లికివందనం అందలేదని వాపోయారు. ఈ విషయమై సోమవారం మండల తహశీల్దారు కార్యాలయానికి అధిక సంఖ్యలో హాజరై జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుల ఆధ్వర్యంలో తహసీల్దారు దస్తగిరయ్యకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో తల్లికి వందనం లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వై.సంజీవరెడ్డి

దువ్వూరు : మండల తహసీల్దార్‌గా వై.సంజీవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అక్బర్ బాషా జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారిగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న వై.సంజీవరెడ్డి బదిలీపై దువ్వూరుకు వచ్చారు. నూతన తహసీల్దార్ సంజీవరెడ్డికి రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యలపై ఆలస్యం చేయకుండా త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ సంజీవరెడ్డి సిబ్బందికి సూచించారు.

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

అట్లూరు : అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఈ కేవైసీ త్వరితగతిన పూర్తి చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. నాగరాజ పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ లోపు అన్నదాత సుఖీభవ కోసం ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో రైతు సేవా కేంద్రాలలో వ్యసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు రైతులకు ఈకేవైసీ చేస్తున్నారు. ఈకేవైసీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు.

కరపత్రాల ఆవిష్కరణ

కడప రూరల్: నగరంలో సోమవారం మను యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటీరియర్ డిజైన్, ఫ్యాషన్ టెక్నాలజీని ప్రారంభించారు. కోర్స్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కాలేజీ డైరెక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ బీఎస్సీ నాలుగేళ్లు, డిప్లొమా రెండేళ్లు, ఒక ఏడాది కోర్స్ ఉన్నాయని అన్నారు.

వం‘ధనం’ కొందరికే..!

- విస్తుగొలుపుతున్న తల్లికి వందనం లబ్ధిదారుల జాబిత
- సాకుల పేరుతో దక్కని సాయం
- ఇదెక్కడి న్యాయమని నిలదీస్తున్న తల్లులు



అనర్హుల జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు రూరల్ : ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం అని చెప్పి చాలా మంది తల్లులకు కూటమి ప్రభుత్వం పంగనామం పెట్టింది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15వేలు జమ చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు జూన్ 12న తల్లుల ఖాతాల్లో రూ.13వేలు జమ చేశారు. ప్రతి 10 మందిలో కేవలం ఐదారు మందికి మాత్రమే తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

సాకుల పేరుతో..

తల్లికి వందనం డబ్బు తల్లుల ఖాతాల్లో జమ కావాలంటే సవాలక్ష షరతులు విధించారు. సాకుల పేరుతో అనర్హుల కింద లెక్క కట్టారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు రూ.12వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉందని, కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నందని, సరైన ధ్రువీకరణ లేదని, ఆదాయ పన్ను చెల్లిస్తున్నారని, లేని భూమిని ఆన్‌లైన్‌లో చూపించి ఎక్కువ మందిని అనర్హుల జాబితాలో చేర్చారు. రకరాల రకాల సాకులు చూపించి తమను అనర్హుల జాబితాలో పెట్టి లబ్ధి దక్కకుండా చేశారని తల్లులు వాపోతున్నారు. అర్హుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ తమకు అకౌంట్‌లో డబ్బు జమ కాలేదని మరికొందరు తల్లులు పేర్కొంటున్నారు. పాఠశాలల వద్దకు వెళ్లితే సచివాలయాల వద్దకు వెళ్లండని, సచివాలయల వద్దకు వెళ్లితే పాఠశాలల వద్దకు వెళ్లమని తమతో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు కార్యాలయాల చుట్టు తిప్పుకుంటున్నారని వాపోతున్నారు.

అర్హులమా.. అనర్హులమా..



తల్లికి వందనం పథకానికి సంబంధించి మా సచివాలయంలో అర్హులు, అనర్హుల జాబితాను ఉంచారు. మా అబ్బాయి జయకృష్ణ పేరు అర్హుల జాబితాలో లేదు, అనర్హుల జాబితాలో లేదు. దీనిపై అడిగితే ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు.

- గంజికుంట సూర్యనారాయణ, నరసింహాపురం, పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీ, ప్రొద్దుటూరు మండలం

అధికారులు స్పందించడం లేదు



మా అమ్మాయి సుచరిత దొరసానిపల్లె హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఆమెకు తల్లికి వందనం పథకం నిధులు జమ కాలేదని సచివాలయానికి వెళ్లి అడిగితే ఎంఈఓ ఆఫీసు వద్దకు వెళ్లమన్నారు. ఎంఈఓ ఆఫీసు వద్దకు వెళితే తమకేమి సంబంధం లేదని సచివాలయంలోనే అడగాలని ఎంఈఓ చెప్పారు.

- పల్లా సురేష్, నరసింహాపురం, పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీ, ప్రొద్దుటూరు మండలం

అనర్హుల జాబితాలో చేర్చారు



నా భర్తకు నెలకు రూ.12వేలు కంటే ఎక్కువ ఆదాయం ఉందని మా పేర్లను అనర్హుల జాబితాలో చేర్చారు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ రూ.12వేలు జీతం తీసుకుంటే తల్లికి వందనం డబ్బులు వేయరా..? రూ.12వేల జీతం నెలసరి ఖర్చులకే సరిపోదు. తల్లికి వందనం పథకానికి అనర్హుల జాబితాలో చేర్చితే పిల్లల చదువులకు ఫీజులు ఎలా చెల్లించాలి.

- కుల్లు తేజ, కానపల్లె గ్రామం, కొత్తపల్లె గ్రామ పంచాయతీ, ప్రొద్దుటూరు మండలం

దొంగపట్టాలను ఉపేక్షించం



దొంగ పట్టాను చూపిస్తున్న తహసీల్దారు త్రిభువన్ రెడ్డి

గోపవరం : దొంగ పట్టాలను ఎట్టి పరిస్థితిల్లో ఉపేక్షించేది లేదని తహసీల్దారు త్రిభువన్ రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపవరం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి దొంగ పట్టాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, దీంతో చాలా మందికి మింగుడు పడడం లేదని, అయినప్పటికి వెనుకడుగు వేయబోనన్నారు. బద్వేలు మునిసిపాలిటీలో ఎన్జీవో కాలనీలో పబ్లిక్ పర్పస్‌కు కేటాయించిన స్థలాలకు కూడా దొంగ పట్టాలు పుట్టించారంటే ఏ మేరకు దొంగ పట్టాలు హల్చల్ చేస్తున్నాయో చెప్పకనే తెలిసిపోతుందన్నారు. ఇప్పటికి ప్రతి రోజు ఒకటి రెండు దొంగ పట్టాలు తన వద్దకు వస్తున్నాయని, సంబంధిత వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగిందన్నారు. గతంలో దొంగ పట్టాలు తయారు చేసే వారి ముఠాపై కూడా కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పగించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఒక స్థలానికి అనేక పట్టాలు పుట్టించడం గోపవరం, బద్వేలు లోనే చూస్తున్నామని ఆయన అన్నారు. దొంగ పట్టాలు తయారు చేసే వారి విషయంలో పూర్తి స్థాయిలో నిఘా ఉంచడం జరిగిందన్నారు. అలాగే పీపీ కుంట జగనన్న లేఅవుట్‌లో అక్రమంగా వేసిన గుడిసెల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నడుచుకుంటున్నామన్నారు. కానీ కోర్టు ఉత్తర్వులను దిక్కరించి ఇంకా వంక పోరంబోకు, ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు కూడా కోర్టును ఆశ్రయించారని తెలిపారు. దాదాపు 160 మంది అక్రమంగా గుడిసెలు వేయగా వీరిలో 80 మందికి పైగా ఇళ్లు ఇన్నవారేనని, మిగిలిన వారు స్థానికేతరులేనని సర్వేద్వారా గుర్తించడం జరిగిందన్నారు. అక్రమంగా గుడిసెలు వేసేందుకు ప్రోత్సహించిన 7 మందిపై బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఏది ఏమైనా జగనన్న కాలనీలో పట్టాదారులకు మాత్రం న్యాయం చేస్తామన్నారు.

బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు

- గత ఇన్‌చార్జ్ ఏఈ సాయిప్రసాద్ అవినీతిపై 70 మంది రైతుల ఫిర్యాదు



ట్రాన్స్ కో ఏఈ సాయి ప్రసాద్‌పై ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చాపాడు : గతంలో పని చేసిన ట్రాన్స్ కో ఇన్‌చార్జ్ ఏఈ, మరికొంత విద్యుత్ శాఖ అధికారులు వలన నష్టపోయిన బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్ కో డీఈఈ శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద సోమవారం బాధిత రైతుల సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన 70 మంది రైతులు తమ జరిగిన అన్యాయంపై రాత పూర్వకంగా పలు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గతంలో ఇక్కడ పని చేసిన కొందరు సిబ్బంది విరిగిపోయిన స్తంభాలు మార్చేందుకు, లూజ్ లైన్‌ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, వాటి ఏర్పాటుతోపాటు తదితర విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇష్టానుసారంగా వ్యవహరించి అవినీతికి పాల్పడినట్లు బాధిత రైతులు ఫిర్యాదు చేశారన్నారు. బాధిత రైతుల నుంచి వచ్చి ఫిర్యాదులను పరిశీలించి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేసి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈఈ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రామభద్రయ్య, అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్షల్లో అవినీతి

చాపాడు మండల ట్రాన్స్ కో ఏఈగా పని చేసిన సాయి ప్రసాద్ రైతులను నమ్మించి రూ.లక్షల్లో అవినీతికి పాల్పడ్డారని నష్టపోయిన బాధిత రైతులకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి డీఈఈ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సాయి ప్రసాద్‌పై అన్ని విధాలుగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫలితాలలో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్, సీబీఐటీ అధ్యాపకులు

చాపాడు : 2024–25 విద్యా సంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన బీటెక్, ఎంబీఏ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి తెలిపారు. ఈ మేరకూ స్థానిక సీబీఐటీలో సోమవారం జేఎన్‌టీయూ నామినీ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి ముఖ్య అతిథిగా పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలలో బీటెక్ సెకండియర్ ఈఈఈలో ఎం.గురుప్రశాంత్ – 9.43, డి.నవీన్‌కుమార్ ఆచారి – 9.33, కె.తిరుమలేశు – 9.19, సీఎస్ఈలో జి.చంద్రిక – 9.38, కె.భావన – 9.24, ఎం.యశ్వంత్ – 9.14, టి.కావ్యశ్రీ – 9.38, ఎం.గురురమ్య – 9.14, షేక్ రహీల అఫ్సర్ – 9.14, డి.రాజేష్ – 9.14, ఈసీఈలో ఎ.చంద్రవర్షిత – 9.29, టి.నాగ మౌనిక – 9.00, ఆర్.బిందుప్రియ – 9.00, సివిల్‌లో యు.షేక్. రిహానా – 9.14 శాతం మార్కులు సాధించగా, ఎంబీఏ సెకండియర్ రెండో సెమిస్టర్‌లో సి.శశికళ – 9.78, ఆర్.వినీత – 9.78, బి.నాగలలిత – 9.78 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించినట్టు తెలియజేశారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

బాబు పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం



సీఎం దావూద్

ప్రొద్దుటూరు : చంద్రబాబు పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం అవుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం దావూద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్య అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలకు సుమారు రూ.4,200 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు రూ.2,200 కోట్లు మొత్తం రూ.6,400 కోట్లు బకాయిలను పెండింగ్‌లో పెట్టిందన్నారు. దీంతో కళాశాలలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయి అధ్యాపకులకు, సిబ్బందికి జీతాలు చెల్లించలేక కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలను అమలు చేశారని తెలిపారు.

నేడు చాపాడు, పల్లవోలు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’

చాపాడు : మండలంలోని చాపాడు, పల్లవోలు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి పద్మలత తెలిపారు. ఉదయం చాపాడులో, మధ్యాహ్నం పల్లవోలు గ్రామంలో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే పంటల సాగుపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆయా గ్రామాల రైతులు హాజరుకావాలని ఏఓ కోరారు.

రేపు పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజనపై అవగాహన

ప్రొద్దుటూరు : ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ కేవీవీ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కన పవర్ హౌస్ రోడ్డులో ఉన్న ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. సోలార్ రూఫ్ టాప్ యూనిట్ ప్రాంగణంలో ప్రత్యక్షంగా అమర్చి తద్వారా సౌర విద్యుత్ ఎలా పనిచేస్తుందో వెండర్లు వివరంగా చూపించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. వినియోగదారులు ఈ కార్యక్రమానికి హాజరై సోలార్ యూనిట్ల ఏర్పాటుపై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

బారికేడ్లు ఏర్పాటు

కొండాపురం: మండలంలోని కొండాపురం ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ప్రమాదాలను నివారించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రైతు విభాగం ప్రధాన కార్యదర్శికి సన్మానం



నాగసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా (వైఎస్సార్‌సీపీ) నాగసుబ్బారెడ్డిని సోమవారం రాత్రి పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ కాశినాయన మండలం సావిశెట్టిపల్లెకు చెందిన ఎలిచెర్ల నాగసుబ్బారెడ్డిని జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించడం హర్షణీయమన్నారు. యువకుడు, ఉత్సాహవంతుడైన నాగసుబ్బారెడ్డికి రైతుల సమస్యలపై అవగాహన ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, కూటమి పాలనలో ఆ పరిస్థితి పోయిందన్నారు. విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జున రెడ్డి, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతారెడ్డి, పంగా గురివిరెడ్డి, వైస్ ఎంపీపీ సీయం బాష, రాజీవ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



ఎస్‌టీవోలను సన్మానిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తాను పని చేస్తున్న ప్రాంతంలో అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.బ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య పేర్కొన్నారు. బద్వేలు సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీవోగా పని చేస్తూ బదిలీపై కడప డిటివో ఆఫీసుకు వెళ్లిన వెంకట సుబ్బయ్యను, నూతన ఎస్‌టీవోగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌బాబును సోమవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు ఉపఖజానా కార్యాలయంలో 7 సంవత్సరాలకు పైగా ఎంతో నిజాయితీ, నిబద్ధతతో వెంకటసుబ్బయ్య విధులు నిర్వహించారని ఆయన సేవలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు మరచిపోలేవని అన్నారు. అలాగే నూతన ఎస్‌టీవో కూడా విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు గంగన్న, ఆనందరావు, రామ సుబ్బయ్య, లక్ష్మీరెడ్డి, రాణి, ప్రసాద్, లక్ష్మీనరసయ్య, సుబ్బరాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులందరూ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈఓ) వెంకటేశ్వర్లు సూచించారు. డీఐఈఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును సోమవారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్ మాజీ జిల్లా సెక్రటరీ చెప్పలి రాజారావు, అధ్యాపకులు సన్మానించారు.

అధికారం అండగా.. ఆక్రమాలు దండిగా



ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేసిన కూటమి ప్రభుత్వ నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికార పార్టీ నాయకులు ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. అధికారం అండగా ఉండగా మీకేమి భయం అనే రీతిలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ మాజీ మండలాధ్యక్షులు యోగానందరెడ్డి ఆరోపించారు. సోమవారం పాయలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా మండలంలో రెవిన్యూ భూములపైన అధికార పార్టీ నాయకులు కన్నేశారు. ఎప్పటి నుండో పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ భూములను సైతం వదలడం లేదు. కూటమి ప్రభుత్వ నాయకుల తీరు ఎలా ఉందంటే అధికారం అండగా ఉండగా దున్నుకో దండిగా అన్న చందంగా మారిందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా మండలంలోని బద్వేలు పోరుమామిళ్ల మెయిన్ రోడ్డులో ఉన్నటువంటి భూములకు రేట్లు అధికంగా రావడంతో కూటమి ప్రభుత్వ నాయకులు వాటిపై కన్నేశారు. వేమకుంట, కామకుంట, మాధవరాయునిపల్లి, పెద్దులపల్లి తదితర రెవిన్యూ గ్రామాల పొలాల్లో అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారం ప్రభుత్వ భూములు, వంకలు, వాగులను సైతం ఆక్రమించుకుని చదును చేసి కంచెలను ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములుగా ఉన్న సర్వే నెంబరు 108, 44 లను అధికార పార్టీ అండదండలతో చదును చేసి కంచెను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక నాయకులు మండల తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా అరకొర వేతనాలు అందిస్తున్నారన్నారు. చాలీ చాలని వేతనాలతో మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు అందలేదన్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందించి కార్మికులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు ఇవ్వకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, పట్టణ అధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, కమిటీ సభ్యులు గుర్రమ్మ, జాకోబ్, రమాదేవి, శ్రీకాంత్, శాంతి, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు వెంకటేష్, గంగాదర్, శివ, పద్మ, మోహన్, కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

బద్వేలు అర్బన్ : బద్వేలు సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్ పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. సీపీఐ బద్వేలు మండల ద్వితీయ మహాసభల సందర్భంగా సోమవారం బాకరాపేట సమీపంలో ఉన్న ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాలకులు మారుతున్న ప్రజల తలరాతలు మారడం లేదని, నేటికి గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన ప్రజలకు మూడు సెంట్ల ఇంటి స్థలం, రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చి హామీను నిలబెట్టుకోవాలని కోరారు. బద్వేలు వేదిక మీదుగా జులై 22 నుండి 24 వరకు జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా సహాయకార్యదర్శి మస్తాన్, రూరల్‌కార్యదర్శి ఇమ్మానియేలు, పట్టణ కార్యదర్శి బాలు, ఏరియా కార్యవర్గ సభ్యులు రమణ, నాగరాజు, విజయమ్మ, వెంకట రమణ, సభ్యులు సుబ్బారెడ్డి, కృప, వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరి బడి అభివృద్ధికి ముందుకు రావాలి



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

బద్వేలు అర్బన్ : ఊరి బడి అభివృద్ధికి గ్రామస్తులు ముందుకు రావాలని రాజుపాళెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని రాజుపాళెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 55 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన చంద్రావతి, వెంకట రమణ పలకలు, బలపాలు, పెన్సిల్లు వితరణగా అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి పలకలు, బలపాలు, పెన్సిల్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కూడా దాతలు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకుని మంచి ప్రయోజకులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాదన విజయ్‌కుమార్, బాలఓబన్న, ఆంథోని, వెంకట సుబ్బారెడ్డి, బ్యూలా సుజాత, సరస్వతి, వెంకటరెడ్డి, థామస్, శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలంకూరులో పర్యటించిన ఆర్డీఓ

జమ్మలమడుగు: ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరులో పులివేందుల ఆర్డీఓ చిన్నయ్య పర్యటించారు. ఇటీవల అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని బాధిత గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో సోమవారం ఆర్డీఓ చిన్నయ్య పర్యటించారు.